కథానిక

# చలిమంట

రచన : 'కేరా'

[మెల్లిగా సాంబంమాటలు వినపడుతూనేవున్నాయ్..."దారినిపోతూ... తలెత్తికూడా చూడదు"..."నిజం" అనుకున్నా...ఈ చిన్ని యెంతమంచిది. తలెత్తికూడా చూడదు. హృదయంలో ముఖం దాచుకునేవుంది. సాంబం చెప్పేది అంతా నిజమే.......................................]

★

తెల్లవారఝామున చలి అపరిమితంగా వేస్తోంది. సరిగ్గా డిశెంబరునెల మధ్యరోజులు. ఎన్ని శాలువాలు కోడించినా లాభం కనిపించిందిగాదు. పల్లెటూళ్లు—దానికి తోడు పూరికొంపలు. ప్రాకృతిక వస్తు సముదాయానికి లోటు యేముంటుంది కనుక. ఇక్కడి మా పల్లెవాసులలో, తెల్లవారుఝామున చలిమంట కాగటం ఒకటి. కోసిన యెండుగడ్డి అంతా తగలేసి—ఆ వెచ్చటిమంట సుఖాన్ని అనుభవిస్తేనే కాని ప్రాణం సుఖంగా వుండదు.

మేం నలుగురం, నేనూ, సాంబం, సూర్యం, నాయుడు. నలుగురం ఆ చీకట్లో, చలిలో జేరి మంటదగ్గర కూర్చుంటేకాని తృప్తి వుండదు. దూరానపోయే వ్యక్తి యెవరికైనాసరే, హఠాత్తుగా చూస్తే, యీ మంట, మనుష్యులు కొరివి దయ్యాల లాగ కన్పిస్తాయి.

మంట ఒక్కొక్కసారి బాగా పైకి వేస్తూ ఆరిపోతూ, వెలుగు-చీకట్లను వంతులవారీగా కలుగ జేస్తోంది. మాసిన గడ్డంతో సాంబం, యోగిలాగా కన్పిస్తున్నాడు. నలుగురు మౌనంగా కూర్చున్నాం. ప్రతివాడూ ఆ మంటవంకనే చూస్తూ, దానితో గొప్ప మౌనసంబంధాన్ని అవలంబించినవాడిలా కన పడుతున్నారు. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, "ఏంరా సాంబం, నీ గడ్డాని కింకా ముక్తి మోక్షం కలిగేట్టు లేదేం?" అన్నా.

చిక్కటి గడ్డాన్ని తడిమి చూసుకున్నాడు. గట్టిగా నిట్టూర్చి "అదే ఆలోచిస్తున్నా" అన్నాడు. వాడు ఆలోచించని విషయం అంటూ యేదీ లేదు. ప్రతి చిన్నవిషయంకూడా ఆలోచించందే, వాడు కార్యాచరణకు పూనుకోడు.

దెయ్యాలకథలంటే నాయుడికి మాంచి యిష్టం. తన అనుభవం మొదలుపెట్టబోయాడు—సైకిలు ప్రయాణంలో దెయ్యం చేసిన ప్రణయ చేష్టలు...చెప్పాడు యిదివరకే ఓ వందసార్లు... వినలేక ప్రాణాలు మాకు పోతాయికాని, వాడికి యెంతమాత్రం విసుగుండదు.

"అదేగా, ఆ లంబాడీ దెయ్యాన్నిగురించేనా" అన్నా.

"ఆ" అన్నాడు.

"ఐతే పాతపురాణం మళ్లా...ఏం చంపు తావురా, బాబూ ఊరుకుందూ"

ముఖం చిట్లించుకున్నాడు. ధుమధుమచూసాడు—ఐనా నాకేం భయం. వాడి ధోరణి వాడిదే కాని, యితర్ల యిష్టాయిష్టాలతో పనిలేదన్నమాట. ఆలాగే వుంటుంది ఏ విషయమైనా.

మంటకి సరిపడ్డగడ్డి అయిపోయిందన్నాను. మూర్తి ఆ చీకట్లోనే దొంగతనంచేసి కొంతగడ్డి

సంపాదించుకు వచ్చాడు. ఇంట్లో ముసలమ్మ మూల్గుతోంది.

"వెధవలు, ఎందుకర్రా ఊరికే ఆ గడ్డి తగలెయ్యడం."

వీళ్లమాటల్ని ఖాతిరీచేస్తే యింక మనం బ్రతకటం కూడానా. వాళ్లు మూల్గినా, మూలిగినా మాకేం అంత పట్టింపులోని విషయం కాదు.

మళ్ళీ అంతా నిశ్శబ్దంగా వుంది. చురచుర మంటూ కాలే గడ్డి...నాలుగువైపులా పరుగులెత్తే మంట...వెలుగులో అక్కడే నెమరువేస్తూ పడుకున్న ఆవులూ...

"ఉఫ్" పెద్దగా నిట్టూర్చాడు సాంబం.

"ఏం, రా, బాబూ అంత బాధ..."అన్నా.

సాంబం వూరుకున్నాడు. మళ్లీ కొంచెం సేపాగి "దేనికైనా పెట్టి పుట్టాలిరా. ఏ జన్మలో చేసుకున్నా...చేసిందానికి ప్రతిఫలం అనుభవించక తప్పదు. పెద్దలు ఆ మాట ఊరికే చెప్పారా..."

వాడి వాదనతో అంతా యేకీభవించాం.

"పెళ్లి లాటరీలాంటిది అన్నాడు ఆ బెర్నార్డుషా" అన్నాడు సాంబం. మా అందరికీ వాడొక సలహాదారు.

"దేవరవారి అభిప్రాయం సెలవియ్యండి" అన్నా.

"నిజంగా అంతే.....మా ఆవిడ విషయం అంతేరా...మొదటనుంచి పెళ్ళి అంటే అసహ్యం ...మీకూ తెలుసుగా".

పరధ్యానంగా వున్న అందరం యెగిరి కూర్చున్నాం. నాకు వినాలని మరీ కుతూహలంగావుంది. ఆ అమ్మాయికి తెల్లపట్టు జరీ అంచుచీర అంటే మహా మోజు. ఆ చీర కట్టుకున్నప్పుడల్లా, తనకేసి చూసుకుంటూ యెంతో మురిసిపోతూంటుంది... అబద్ధం యెందుకుగాని, అందమైన వాళ్లల్లోనే లెక్క. కాని బజారంటపోతూ, పక్కలికిగాని, దొంగచూపులు చూడటం, లేకపోతే సరిగ్గానే ధైర్యంగా నదురు బెదురులేకుండా చూడటం యీ రెండూ లేవు. బజారంటే పోతూ కసాయివాడి వెనకాలపోయే గొర్రెలాగ తలవంచుకునే పోతుంది.

సాంబాన్ని మళ్ళీ క్రియలోకి త్రిప్పి కూర్చున్నా. మనం శ్రద్ధతో "ఊ" అంటూ వుండాలి కాని, యెంత స్వల్పవిషయం ఐనా సరే వాడు అహోరాత్రులు వర్ణించి చెపుతాడు.

"మొదట్లో పిల్లను చూసాకేలే...ఓ నాటకం ఆడదామని, పెళ్ళి యిప్పుడు చేసుకోవటం యిష్టం లేదన్నా" చెప్పటం ప్రారంభించాడు సాంబం.

వాడి మాటల్లో నిజం యెంతో తెలిసినవాడిని నేను ఒక్కణ్ణి. ఈ విషయం స్వయంగా సాంబానికే తెలియదు—వాడి పెళ్ళాం చిన్నిని చిన్నప్పటినుంచీ యెరుగుదును. ఇద్దరం ఒకేబడిలో చదువుకున్నాం...వెధవ సాంబంగాడు మొదట్లో చూడగానే పెళ్ళికి ఒప్పుకుంటూ ఎగిరి గంతేసాడట ...పైగా తనకి యిష్టంలేదని అన్నానంటూ యిప్పుడు కోతలు.

"ఐనా అది యేమందో తెలుసా" సాంబం చెపుతున్నాడు "చేసుకుంటే ఆయన్నే చేసుకోవాల ...లేకపోతే చస్తానంది".

"భేష్, మా మంచిమాట అందిరా...రాజా బ్రతుకు కాదూ" అన్నాడు సూర్యం.

"అవునన్నట్టు" తన అంగీకారం తెలియచేసాడు నాయుడు. మొగుడూవద్దు, ఎవరూ వద్దు, యీ సంబంధంచేస్తే చస్తానంది చిన్ని. ఐనా తల్లి దండ్రీ చావబాది అంటగట్టారు. కాపరానికి వచ్చాకకూడా, సాంబం అనుమానం...దెబ్బలు పడ

లేక...అతి జాగ్రత్తగా సంచరిస్తోంది...ఆ జాగ్రతే దానికి అంత ప్రశంసని తెచ్చిపెట్టింది.

"ఈడ ఉంటా రమ్మని,

ఏడ పోయినావే పిల్లా...

ఏడపోయినావా..." పాడుతూ పోతున్నాడు సుబ్బాయ్ పొలానికి...

సాంబం మళ్ళీ..."దాని స్థితి చూస్తే జాలి వేసింది. ఎంత పట్టుదలయిన మనిషి కాకపోతే, అలా అంటుందిరా...యెన్నో విధాల చెప్పారు దాని అమ్మ అయ్యా. "ఉహూ, ససేమిరా" అంది. నిజానికి నాకూ యెంతో సంతోషం వేసింది. ఆఖరికి తెగించి అడిగేశా. అదీ అంతగా ముచ్చటగా పడుతూంటే, కాదనటం లేదు. అలాగే జరిగించమన్నా..."

ఓ రెండుగంటలనుంచీ మంట కాగా నేమో, కడుపులో మంట బయలుదేరింది. ఎంతకైనా గడ్డి మంట...ఆ వేడి నాలో వేడిని యెక్కువజేసింది.

"ఇక పోయి పడుకుంటారా" అన్నా.

"ఏం" అన్నారు అంతా.

"మంటగా ఉందిరా ... కడుపులో...ఇక పోయి పడుకుంటేనే గాని లాభం లేదురా"

"కథ వినవ్" సాంబం అన్నాడు,

"తరువాత యెప్పుడన్నా వినొచ్చులే. నువ్వు యెక్కడికీ పోవు... నేనూ పోను గా",

తప్పించుకుని యింటిదారి పట్టాను. తలవంచుకుని నడుస్తూ గోడప్రక్కనే నడుస్తున్నా... మెత్తని చెయ్యి నా చేతిని తాకింది...నిద్రకళ్ళలో ఉలిక్క

"SCABIOL"

An Ideal Remedy For All Skin Diseases.

స్కేబియాల్

తీట, ఉష్ణపుగడ్డలు, మొటిమ. మున్నగు సకల చర్మవ్యాధుల నివారణకు అమోఘమయినది.

అంతట దొరకును,

తయారుచేయువారు :

ది మధుర కాటేజ్ ఇండస్ట్రీస్,

80, దానప్ప మొదలివీధి, మధుర.

పడ్డా... తెల్లటి జరీ అంచుచీర నవ్వుముఖం కనిపించింది... చిన్ని...

"ఎంతసేటినుంచో చూస్తున్నా ... ఇప్పటికి వచ్చావా ..." అంది.

"మరి నాకేం తెల్సు".

"ఆయనేమిటి చెప్పుతున్నారు".

"మీ పెళ్ళికథే...యేడ్చి పట్టుబట్టి, ఏరి కోరి చేసుకున్నారటగా" అన్నా.

"మరే పాపం" కిసుక్కున నవ్వింది. చెయ్యి పట్టుకుని పాకలోకి దారి తీసింది.

"ఎన్నాళ్ళనుంచో చూస్తున్నా...అవకాశం యిప్పటికి దొరికింది".

మాట్లాడలా... మొగంలోకి దీక్షగా చూసి "ఇంకా యీ నిర్లక్ష్యం యెందుకురా...చిన్నిని మరిచిపోయావ్" కావిలించుకుంది...చలి యెగిరిపోయింది....

మెల్లిగా సాంబం మాటలు వినపడుతూనే వున్నాయ్..."

"దారినిపోతూ...తలెత్తికూడా చూడదు",

"నిజం" అనుకున్నా... ఈ చిన్ని యెంత మంచిది. తలెత్తికూడా చూడదు. హృదయంలో ముఖం దాచుకునే వుంగి. సాంబం చెప్పేది అంతా నిజమే...

"చిన్నీ నువ్వు చాలా మంచిదానివే" అన్నా.

"ఊఁ" అంటూ మరింత దగ్గరసా...జానయ్య యెడ్లను తోలుకుంటూ రోడ్డంట పోతున్నాడు. మెళ్లో మువ్వలు గణగణమంటున్నాయి...

FOR Fire, Motor, Marine, Accident,
Fidelity Guarantee & Employers Liability
Insurances

Consult:

**United India Fire & General Insurance Co., Ltd.,**
UNITED INDIA LIFE BUILDING
Esplanade :: MADRAS.
*Branches:* BOMBAY, CALCUTTA. LAHORE & KARACHI.